# నిత్య కళ్యాణి

గుమ్మంలో అడుగు పెట్టేసరికి గొల్లుమన్నా రందరూ ఇలాజరగటం సామాన్యమైన విషయమే. అయినా, మామయ్య పరిస్థితుల్ని చూసి సానుభూతి చూపించాల్సిన అవుసరం నాకుమాత్రం వుంది. గగ నాన్ని సహితం గగుర్పాటు కలిగించే ఆరోదనలు నన్ను కలవర పర్చేయి. ముఖ్యంగా వీటన్నిటికన్నా కామేశ్వరి పరిస్థితి నన్ను బాగా కదిలించివేసింది.

దూరంగా గోడకు ఒకమూలగాచేరబడి దుఃఖంతో కుమిలిపోతూ, బాధను బయటికి కాన రానీకుండా సకలవిధాల ప్రయత్నిస్తూ ఓడిపోతూ, మానసికంగా, అర్ధ్వోన్నస్థితికి దిగజారిపోతున్న కామేశ్వరి నన్ను చూసి "బావా" అంటూ బావురుమంది.

వయస్సులో చిన్నవాణ్ణి. ఇలాంటి సమయాల్లో ఎలా ప్రవర్తించాలో నాకు అనుభవమూ లేదు. ఏం చేయ్యాలో తెలియక బరువెక్కిన హృదయంతో మౌనంగా నా సానుభూతిని వ్యక్త పరుస్తూ కూర్చు న్నాను. కానేసటికి అంతా ఎవరికినారు మామూలు స్థితికి వచ్చేరు.

కామేశ్వరికి ఇంత చిన్న వయస్సులో అంతటి కష్టం కలిగిందంటే ఎంత రాతిగుండె అయినా ఇట్టే కరిగి పోక తప్పదు. సాధారణంగా ఆడపిల్ల — పెళ్ళి భర్త, సంసారంవంటి విషయాలు తలుచుకుని ఎంత గానో మురిసి పోతుంది. స్మృతి పథంలో సుందర నందన వనాలను సృష్టించుకుంటుంది, ఎన్నెన్నో కలలు కంటుంది. అలానే కామేశ్వరికూడా ఊహాలోకంలో స్వేచ్ఛావిహంగంలా విహరించి వుంటుందన్నది నిజం. కాని, ఇంతలోనే తను ఇలాంటి విపరీత పరిస్థితుల్ని పరిణామాలని ఎదుర్కోవలసి వుంటుందనీ, తను ఈ విధంగా నాశనం అవుతుందని అనుకుని వుండదు.

కామేశ్వరి ముఖం చూస్తుంటే ఈ విషయాలన్నీ ప్రత్యక్షంగా కనిపిస్తాయి.

ఇరవై పళ్ళ క్రిందటి మాట. మా మామయ్యకు ఒక్కగానొక్క కూతురు పుట్టింది. బారసాలకు అమ్మ తోబాటు నేనూ వెళ్ళాను. ఆనాడు అమ్మ మామ య్యతో అన్నమాటలూ, మామయ్య జవాబు ఇంకా నాకు జ్ఞాపకమున్నాయి.

"ఒరే తమ్ముడూ! కామేశ్వరిని నా కోడలుగా చేసుకుంటారా? ఇంతకంటే నీకు కలసొచ్చే సంబంధం ఏముంటుంది గనక" అంది అమ్మ.

"దానికేంలేవే' చెల్లాయ్! ఇద్దరూ పెరిగి పెద్దవా ళ్ళయితే అలానే కానిద్దాం" అన్నాడు మామయ్య,

ఆరోజుకు నాకు పెళ్ళన్నా, పెళ్ళామన్నా ఏమిటో తెలియదు. అయినా అదేదో ఒక క్రొత్తరకం ఆట అనుకుని సంబరపడి "పాపనే పెళ్ళి చేసుకుంటాను. పాపాయి నా పెళ్ళాం" అంటూ ఇల్లంతా గోల పెడుతూ తిరిగాను. నావాలకానికి, చేష్టలకు వచ్చిన బంధువర్గమంతా కడుపు చెక్కలయ్యేట్లు నవ్వు కున్నారు. నాకేమిటో అదోలా అనిపించింది. గట్టిగా ఏడుస్తూ అమ్మవళ్ళో చేరిపోయాను,

ఆ తరువాత ప్రతి సంవత్సరం మామయ్య ఇంటికి వేసవిలో వెళ్తూండటం కొన్నాళ్ళపాటు కామేశ్వ రితో హాయిగా ఆట పాటలతో కాలం వెళ్ళబుచ్చటం జరుగుతూండేది. మామయ్య అత్తయ్య మేం అలా వుండటం చూసి ఎంతగానో ఆనందించేవారు.

మేం పెరిగి పెద్దవాళ్ళ మయ్యాం. కాలంతో పాటు మా రెండు కుటుంబాల్లోనూ చాలా మార్పులు వచ్చేయి. అంచేత మామయ్య అమ్మ కిచ్చిన మాట "మాట"గానే మిగిలిపోయింది.

శ్రీ ఏ. యస్. రామారావు

మామయ్యస్థితి ఒకనాటి కంటె ఈ నాడు బాగా పెరిగింది. పట్నంలో ఒక పెద్దమేడ, ఉన్న వూళ్ళో పాతికెకరాల మాగాణి. పెద్దతోట ఉన్నాయి. రెండు మైసూరు గిత్తలూ, ఇంట్లో పాడీ, పనివాళ్ళూ, ఎప్పుడూనిండుగానే వుంటుందిఇల్లు. పొలంనించివచ్చిన పంటా. పట్నంనుంచి వచ్చే అద్దె కలుపుకుంటే మామయ్యా ఆ వూరికి పిల్లజమీందారు అనక తప్పదు.

మామయ్యా అంతస్థు ఈ నాడు ఈ స్థితికి వచ్చిందంటే అందుకు కారణం అత్తయ్యా. అత్తయ్యా సంసారం చక్కదిద్దటం, నాలుగురాళ్ళు కూడబెట్టటంవంటి విద్యల్లో అందెవేసిన చెయ్యి. పైగా అత్తయ్యకు ఆసరాగా ఆమె అన్న ఒకాయన వున్నారు. అతను వ్యవహార్త. ఏ వ్యాపారాల్లో ఎంతెంత పెట్టుబడులు పెట్టాలో, ఏవ్యాపారం ఎలాచేస్తే ఎంతెంత లాభాలు వస్తాయో అతనికి పాగాతెల్సు. ఇలా నలుగురి చేతా చేయిస్తూ నాలుగురాళ్ళూ, నలుగుర్లో మంచిపేరు సంపాయించుకున్న వ్యక్తి. మామయ్యాను ఈ స్థితికి తీసుకు వచ్చిందికూడా ఈయనే.

మాది సామాన్యమైన కుటుంబం. మా నాన్నచాల మందిలాగే ఓ గవర్నమెంటు ఆఫీసులో గుమస్తాపని చేస్తుండేవారు. ఆయన సంపాదన తప్పిస్తే. ఇతరత్రా కలసివచ్చే రాబడిలేదు. నేనొక్కణ్ణే సంతానంకావటం వల్ల, ముచ్చటాయ ముగ్గురు సంసారం అవటంచేత తినటానికి లోటులేకుండా జరిగిపోయేది. నేను గొప్ప తెలివైనవాణ్ణి కాకపోయినా, చదివిన క్లాసు చదవకుండా, డిగ్రీకాయితాన్ని మొదటి తరగతిలోనే సంపాయించాను. దానిపరంగా ఈ దూరప్రదేశంలో దొరకిన వుద్యోగంతో ఈనాటికి మా నాన్నకు వేన్నీళ్ళకు చన్నీళ్ళ తోడుచందంగా ఇంత సంపాయించి యిస్తున్నాను.

అయినాసరే నాయీక్వాలిఫికేషన్సు కామేశ్వరిని వివాహం చేసుకొనటానికి సరిపోలేదు. అందుకు నేను ఈనాడు చింతించనూలేదు.

ఇలా నాకలలు కలలుగానే వుండిపోటానికి మా అత్తయ్యా ప్రబల కారణం. అత్తయ్యకు నేనంటే ఎటువంటి దురభిప్రాయమూ లేదన్నమాట వాస్తవం. కాని మా అంతస్తు తమఅంతస్థుకు సరిపోదనీ, పైగా తనఅన్నయ్యా తమనీస్థితికి తీసికొచ్చినందుకు కృతజ్ఞతా సూచకంగానూ, కామేశ్వరిని తన అన్న కొడుక్కి ఇవ్వటానికి నిశ్చయించుకుంది. ఆమె నిశ్చయానికి మామయ్యా తల ఒగ్గక తప్పనూలేదు. ఈ సంగతి నలుగురికీ తెలియటానికి అట్టేకాలం పట్టనూలేదు.

కామేశ్వరి కంఠాన మంగళసూత్రం కట్ట బడింది. కామేశ్వరి పరాధీనరైుపోయింది.

ఉద్యోగరీత్యా దూరదేశాల్లో ఉండటంచేత కామేశ్వరి వివాహానికి ఎంత ప్రయత్నించినా వెళ్ళ లేక పోయాను. నేనురాక పోయినందుకు మామయ్యా వాళ్ళూ. ముఖ్యంగా కామేశ్వరి ఎంతబాధ పడ్డారో పాపం!

కాని ఇంతలోనే ఎంతజరిగింది. పెళ్ళయి ఆర్నెల్లయినా తిరక్కుండానే ఆ మాయదారి మృత్యువు కామేశ్వరీ భర్త ప్రాణాల్ని తీసుకు పోయింది. ముక్కుపచ్చలారని కామేశ్వరి నుదుటి కుంకాన్ని తుడుచుకు పోయింది. ఆమె జీవితాన్ని నట్టేట కలిపేసింది.

హఠాత్తుగా అందిన ఈ వార్తకు నాగుండె ఆగినంత పనయింది. అందుకనే వెంటనే శెలవు పెట్టి వచ్చాను నే వచ్చేసరికి పరిస్థితి ఇది.

ఏవో సాకులతో ఆనాడు నన్ను కాదన్న వీళ్ళందరికీ గోడకు అనుకొని మౌనంగా కూర్చున్న నన్ను చూడటానికి గాని, నాతో మాట్లాడటానికి గాని, అభిమానం అడ్డువస్తోంది. ఈ రకమైన వాతావరణాన్ని అవగాహన చేసుకోటానికి నాకు కష్టమనిపించలేదు. అక్కడున్న నలుగురూ నన్నేవో కుశల ప్రశ్నలు వేయటం. నేను సమాధానాలీయటం అయిపోయింది కాని, కామేశ్వరి భావి ఏమిటన్న ప్రశ్న నన్ను మనస్సులో పీక్కుతిన నారంభించింది.

భర్త పోయాడన్న మాటే గాని, కామేశ్వరి రూపంలో నాకెటువంటి మార్పు కనుపించలేదు. అటువంటి కామేశ్వరిరూపు మరుచటిదినం పూర్తిగామారి పోతుంది. సాంప్రదాయాలూ. ఆచారాలు పేరుతో ఈలోకపు కాకులమూకకు బలిఅయిపోతుంది. కంకణ కింకిణీ నిక్వణాలు ఆఖరుసారిగా మరునాడు ధ్వనిస్తాయి. పద్మంలాంటి ముఖానికి చందమామలాబొట్టు ఇక కనిపించదు. గాలికి రెపరెప లాడే వుంగరాల ముంగురులు ఏమవుతాయో ఎవరికి తెల్సు? కంటికి కాటుక, ఒంటికి ఆభరణాలు బహిష్కరించ బడ

తాయి. స్త్రీ తన పవిత్రత కోసం దేన్ని ప్రాణంతో సమానంగా కాపాడు కుంటూంటుందో ఆ పవిత్ర బంధనం మంగళసూత్రం త్రెంచి వేయబడుతుంది. ఇక మిగిలేది ఎండినమ్రోడులా జీవితం, ఇంకినదిలాభావి.

తల్చుకుంటే గుండె బ్రద్దలైపోయింది. ఇంతమంది పెద్దలూ, అనుభవజ్ఞులూ చూస్తూ ఇలా కూర్చున్నందుకు ఆశ్చర్యం కలిగించటమే కాక, కష్టమనిపించింది కూడా. ఆనాడు కందుకూరి, రాజా రామమోహన రాయ్ వంటివాళ్ళు ప్రజల్లో పరివర్తన తీసుకురావటంలో ఎందుకంతగా శ్రమించారో నేనిప్పుడుబాగా వూహించుకో గలిగాను. మనసులో వారికి హృదయపూర్వక నమస్సులు తెల్పుకున్నాను. ఈ పరిస్థితిలో నేనొక్కణ్ణి ఏంచెయ్యగలను? నాలో విప్లవాత్మకశక్తి వుబికిపోయింది. మార్గాల నన్వేషించింది మనసు.

అమ్మనీ, నాన్ననీ, కదిపి చూసాను. నే నాశించినంతగా వారివద్దనుంచి సమాధానం రాలేదు. "ఏం చేస్తాం? విధి నెవరు తప్పించగలరు?" అంటూ ఎదురు ప్రశ్న వేసి సానుభూతి వాక్యాలు పలికారు.

ఆ రాత్రల్లా నాకు సరిగా నిద్రపట్టలేదు. కామేశ్వరి భవితవ్యం నన్ను కలవర పర్చింది. సమయం మించిపోతే ఇక ఎవ్వరూ ఏమీ చేయలేరు. అంతా అయోమయంగా వుంది.

మరునాడుదయం అంతా మామూలు వేళకంటే ముందుగానే లేచారు. ఒక అమాయక జీవితాన్ని బలిచేయడానికి సర్వం సిద్దం చెయ్యటంలో ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నులై వున్నారు.

అంతాసిద్ధమైంది. కామేశ్వరి రూపు ఇక మారి పోతుంది, అత్తయ్య గొల్లు మంటోంది. మామయ్య నోటికి అడ్డంగా తువ్వాలు పెట్టుకుని దుఃఖిస్తున్నాడు అమ్మ, నాన్న, మిగతా బంధువర్గం ఎవరికి తోచిన విధంగా వారు ఓదారుస్తున్నారు. కామేశ్వరిని ఎవరో బలిపీఠం మీదకు తీసుకు వెడుతున్నారు.

నాలో చెలరేగిన విప్లవాన్ని అణుచుకో లేక పోయాను. లోన రక్తం ఉడికిపోయింది,

"ఆగండి!" అరచాను. గట్టిగా. ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. అందరూ నావంక ఆశ్చర్యంగా చూసారు.

"కామేశ్వరి నుదుట తిలకం చెరగటానికి వీల్లేదు. కామేశ్వరి జీవిత విపంచిలో అపశృతి పలకటానికి వీల్లేదు. మీరంతా కామేశ్వరి నిండు జీవితాన్ని నిలువునా కాల్చేస్తున్నారు. మీరు చేస్తున్నపని ఎంతవరకు న్యాయమో ఆలోచించారా? ఎందరు భార్యలు చనిపోయినా మొగాడికి మరో పెళ్ళి చేసుకోడానికి హక్కు వుంది. భర్తంటే ఏమిటో, వైవాహిక జీవితమంటే ఏమిటో తెలియని ఈ ముక్కుపచ్చలారని, అమాయకురాల్ని అన్యాయం చేస్తారా? మనస్వార్థం కోసం, ఆచారాలూ, సాంప్రదాయాలూ, పేర్లుచెప్పి ఈ పసిడిబొమ్మను బుగ్గిపాలు చేస్తారా? వీల్లేదు. ఎన్నటికీ వీల్లేదు. కామేశ్వరి జీవితం ఎండిన మ్రోడు అవటానికి వీల్లేదు. కామేశ్వరి కలలు కల్లలవటానికి అంతకన్నా వీల్లేదు. ఎందరెదిరించినా సరే — కామేశ్వరిని వివాహమాడతాను. ఆమె మంగళ సూత్రాన్ని రక్షిస్తాను. ఆమె మాంగళ్యాన్ని కాపాడతాను. కామేశ్వరి నా కామేశ్వరి. నా కామేశ్వరి 'నిత్యకళ్యాణి' అని ఏమేమో అనేశాను. ఆవేశం అణచుకోలేక.

అమ్మనాన్న అనుకోని నా యీప్రవర్తనకు ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ నన్ను కాదనలేనివాళ్ళు ఈనాడు కూడా ఏమీ అడ్డుచెప్పలేదు. పైగావారి పెదవులమీద చిరునవ్వులు నాట్యం చెయ్యటం చూడగలిగాను.

మామయ్యా అత్తయ్యా స్థబ్ధులై నిశ్శబ్దంగా నిల్చున్నారు,

కామేశ్వరి నుదుట తిలకం పెట్టాను. కామేశ్వరి "బావా" అంటూ నాకాళ్ళను చుట్టేసింది. ధర్మోదకాలివ్వడానికి వచ్చిన పెద్దల చేతుల్లోంచి మాపై అక్షతలు రాలేయి.

అక్కడక్కడ అమ్మలక్కలు చెవులు కొరుక్కున్నారు. కాని ఒక నిండు ప్రాణి భవితవ్యాన్ని సంరక్షించి, సుఖమయం చేయగలిగానన్న ఆనందంలో వారి మాటలు నా చెవులను సోకలేదు.

కాని. దూరంగా రేడియోలోనుంచి "అందమే ఆనందం" అన్నపాట సన్నగా వినిపించింది సమయానికి తగ్గట్టుగా !

★